


ఠమని తల బాదుకుంది చంద్రావతి.

చేత్తో కాదు — చదువుతూన్న పుస్తకంతో.

రాత్రి.

తొమ్మిదిన్నర.

గది మధ్యగా దూలంనుంచి వేళ్ళాడుతోన్న ఎలక్ట్రిక్ లైటు గుడ్డి గుడ్డిగా వెలుగుతోంది. ఆ వెలుతురు బూజుపట్టిన వెలుతురులా ఉంది. ధూళితో కలిసినట్టుంది. చచ్చిపోతూన్న మనిషి నవ్విన నవ్వులా మసకగానూ వెలితిగానూ ఉంది.

కటకటాల్లేకున్నా ఆ గది జైలులా ఉంది.

బార్లా తెరిచిన గదిగుమ్మం. తెరిచిన రాక్షసి నోరులా ఉంది.

రెక్కలులేని గదికిటికీ. రెక్కలు తెగి గుడ్లు తేలేసిన కబోది పక్షిలాగే ఉంది.

చంద్రావతికి ఏడుపొస్తోంది.

కిటికీకేసి ఒకమారూ, గుమ్మంకేసి ఒక మారూ_ అటు వేటగాడూ. ఇటు తోడేలూ తరుముకురాగా. చిక్కిపోయిన జింక పిల్లలా_ బెదిరి బెదిరి చూసింది.

కిటికీ కవతల ఏముంది? గుమ్మానికవతల ఏముంది?

కిటికి కవతల ఒక రాక్షసుల కార్ఖానా ఉంది. ఉక్కు సమ్మెట్లు ధనాధనామంటూ చప్పుళ్ళు చేస్తున్నాయి. కిటికీ కవతలే పిశాచాలున్నాయి. అవి నవ్వుతున్నాయి. బిగ్గరగా అరుస్తున్నాయి. చప్పట్లు చరుస్తున్నాయి.

గుమ్మాని కవతల ఏముంది?— ఒక బ్రతుకుతూన్న శవం ఉంది.

కిటికీ కవతల-మూడడుగుల చీకటి కవతల—ప్లీడరు గారింటి కిటికీ కనిపిస్తోంది. ఆ లోపలిదే— ప్లీడరుగారి ఆఫీసు_అదే రాక్షసుల కార్ఖానా !!

ఆగది ఒకప్పుడు రాక్షసుల కార్ఖానా గానూ, ఒకప్పుడు నరకంలో యమధర్మ రాజు ఆంటీ ఛేంబర్ (Anti chamder) గానూ అనిపిస్తోంది చంద్రావతికి. బట్టతల కలిగి, కళ్ళజోడు కలిగి, ప్రస్తుతానికి బనీను మాత్రమే తొడిగిన ప్లీడరుగారే యమధర్మ రాజు. ఆయన ఆ గదిలో అహోరం దొరకని తోడేలులా తిరుగుతూ తన టైపిస్టుకు నోటీసులు డిక్టేట్ చేస్తున్నాడు _(టైపు చెయ్యడానికే _ నోటీసులు _ అవి అంది గుండెలాగి చావగల మందభాగ్యులు వేరే ఉంటారు_)

ప్లీడరుగారు యమధర్మరాజైతే ప్లీడరు టైపిస్టు యమభటుడు.

ఏ సేవకుడికి యజమానిపైనా భక్తి ఉండవచ్చునేమో గాని. యమభటుడికి యముడి యెడల భక్తిలేదు. కాని భయం మటుకు ఉంది. ఎక్కడ భయం ఉంటుందో అక్కడ అజ్ఞాతంగా కసి కూడా ఉంటుంది: భయంగా అగాధంలోకి పడే నీటిలో విద్యుచ్ఛక్తి దాగిఉన్నట్టు. తన భటుడికి తనంటే కసి ఉన్నటు యముడికి తెలుసు. అందుకే వీలయినప్పుడల్లా చీవాట్లతో సత్కరిస్తూంటాడు. తన కసి సంగతి యముడికి తెలిసిందని యమభటుడికి తెలుసు. కాని, అతను డైరెక్టుగా యముడిమీదే కసి తీర్చుకునే వీలులేదు. అందుకే యముడి ఆరోప్రాణమైన టైపుమిషన్ని యథాశక్తి బాదేస్తూంటాడు_ టప్‌టప్_ టపటపటపటప్_

కాని, చంద్రావతి పాలిట అది టైప్ మిషన్ చప్పుడు కాదు. వంద ఉక్కు కార్ఖానాల రణగొణధ్వని.

దేవుడా-దేవుడా_ నేనేం చేతును?

తల బాదుకుంది చంద్రావతి; ఈమారు చేత్తోనే—చేతి గాజు ఒకటి పటుక్కున పగిలిపోయింది—

కిటికీ అవతల ఇంకా ఏమున్నాయి?

పిశాచాలు!—

రాక్షసులు_పిశాచాలు-వీళ్ళలో ఎవరు గొప్ప? లేదా-ఎవరుకింద? ఎవరుపైన?_

ఏమో—

కాని, ప్రస్తుతానికి మాత్రం రాక్షసులు కింద ఉంటే—పిశాచాలు పైన ఉన్నారు. పైన, అంటే ప్లీడరుగారింటి డాబాపైన.

అక్కడి నాయక పిశాచం ప్లీడరుగారి కొడుకు. మిగతా అన్నీ అతిథి పిశాచాలు. వెయ్యి ట్యూబులైట్ల వెలుతురులా వాళ్ళ మీద కాస్తోంది వెన్నెల. పొట్లాంలోంచి ఒలికిపోయిన చమ్కీలా, వాళ్ళ తలల మీదుగా, దూరంగా మెరుస్తున్నాయి చుక్కలు. వాళ్ల కొందరు పిట్టగోడలమీద వాలుగా కూచున్నారు. పిట్టగోడమీదే ఉన్న ట్రాన్సిస్టర్ హిందీ సినిమా పాటల్ని హోరుమని పాడుతోంది. పిశాచాలచేతుల్లో పేకముక్కలున్నాయి. పిశాచాల నోళ్ళలో బూతుమాటలున్నాయి. పిశాచాల గుంపు నుంచి పెద్ద పెద్దగా వెకిలి నవ్వులూ వెర్రి కేకలూ వినవస్తున్నాయి.

అయ్యో!_ దేవుడా_ నేనెక్కడికిపోయి చావను?

తల బాదుకుంది చంద్రావతి. ఈ సారి చేతోకాదు, పుస్తకంతోనూ కాదు. అసలు దేని"తోనూ" తలను బాదుకోలేదు. తలను గోడకేసి బాదుకుంది—

తల దిమ్మయిపోయింది, కాని బొప్పి కట్టలేదు.

రోజూ చచ్చే చావుకి ఏడవడంఉండదు. రోజూ బాదుకునే తలకు బొప్పికట్టడం తెలేదు.

ప్రమాదీచ 1973 ఉగాది కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి పొందిన కథ




కిటికీనుంచి తల తిప్పి– గుమ్మంవేపు చూసింది చంద్రావతి.

అవతల, నడవలో– నేరుగా లైటు కనిపించడంలేదుగాని, మట్టి కలిసిన మైనపు వెలుతురులా వెలుతురు మాత్రం కనిపిస్తోంది. జిడ్డు వెలుతురు కింద, రాతబల్లమీదికి, విరిగిపోయినట్లున్న మెడతో వంగి చూస్తూన్న వాడు– చంద్రావతి తండ్రి. దూరం నుంచి చూస్తే, చూస్తూన్న ఫైలు చూస్తూనే అలాగే చచ్చిపోయినవాడిలా ఉన్నాడు. అడపాదడపా కదులుతూ ఉండబట్టి సరిపోయిందిగాని, లేకుంటే హఠాత్తుగా చూసిన వాళ్ళు తణ్ణి చచ్చిపోయినవాడని అనుకునే ప్రమాదం ఉంది. దూరంనుంచి చూస్తే అతని నెరిసిన జుట్టు తెల్లగా మెరుస్తూ కనిపిస్తోంది. గాలికోసం బనీను కూడా తీసేసిన అతని శరీరపు పైభాగం బెండు కొయ్యతో చేసిన పాత బొమ్మలా కనిపిస్తోంది.

దగ్గరికెళ్ళి చూస్తే అతని కళ్ళజోడు ముక్కు కొసకి జారి ఉండడం కనిపిస్తుంది అతని నుదుటిమీద తెల్లటి విషపు బొట్లకి మల్లే తేలిన చెమట కనిపిస్తుంది. ఒక్క దగ్గు వినిపిస్తుంది. పనికిరాని కంచుచెంబును మతిచెడిన పిల్లవాడు పదే పదే నేలకేసి కొడుతున్నట్టుంటుంది అతని దగ్గు. అతనికున్న రోగమేమిటో అతనికే తెలీదు.

# చదువు

పరీక్షచేసిన డాక్టరు మందులచీటీ అయితే రాసిచ్చాడుగాని, రోగమేమిటో చెప్పలేదు. (బహుశా అతనికీ తెలీదేమో!—)

ఫెళ్ళలోంచి తలెత్తకుండానే మరోమారు దగ్గాడు చంద్రావతి తండ్రి. దగ్గడమంటే అలాఇలా దగ్గలేదు—

క్షణం అక్కడఉంటే— ఘోరమైన అతనిస్వరపేటిక పగిలిపోతుందా అనిపించేంతగా దగ్గాడు.

తండ్రీ! — నే నెలా వేగేది?

తలబాదుకోలేదు చంద్రావతి.

తలబాదుకునే శక్తిలేదు చంద్రావతికి.

ప్రాణం విసిగిపోయినదానిలా తల వెనక్కి వేలాడేసింది.

తల తిరిగి పోతోంది.

టపప్–టపస్–టప్–టపప్పపపప్— టప్ – అండ్ ది ప్లెయింటిఫ్ ఈజ్ నాట్ ఇన్ ఎనీవే రెస్పాన్సిబుల్ ఫర్.

అప్పుడల్లా అయిందా– మొన్న నేనూ ఆనంద్‌గాడూ మళ్ళీ వెళ్ళేంరా హాస్పిటల్‌కి–సిరెంజ్ కడుగుతూ తెల్లటిడ్రెస్‌లో కనిపించిందొరే – వెరీ బ్యూటిపుల్‌గా ఉణ్ణింది పిల్ల – ప్యూర్ వైట రోజ్‌లా లౌళీగా కనిపించింది – మనం అక్కడికి రావడం చూసి నవ్వీనవ్వనట్టు సన్నటి స్మైలొకటి విసిరేసింది – ఒరే – ఎంత సెక్సీగా నవ్విందనుకున్నావురా. ఆ నవ్వు చూసేడంటే– రుష్యశృంగుడు కాదు–వాడి గ్రాండ్‌ఫాదరైనా సరే– అది మళ్ళీ ఆ నవ్వు ఎప్పుడు నవ్వుతుందోనని ఆ తెల్లగౌను కుచ్చెళ్ళ చుట్టూ తిరుగుతూ చచ్చేంతదాకా అక్కడే ఉండిపోనన్నమాట–మనం రుష్యశృంగుళ్ళవీ కాఁవు ప్రెవరాఖ్యులఁవూఁ కాఁవుఁ– ఆ సంగతి మీకందరికీ తెలుసుగదా–

తెలుసుగురూ తెలుసు– ప్రొద్దున ఇన్‌టర్‌డ్యూసు అయిన చీరతో మధ్యాన్నం మ్యాట్నీ– సాయంత్రం బీచీ–మరింక– నీ సంగతి కొత్తగా చెప్పేదేంటి గురూ–

మ్యారేజీ లేకుండా ఫ్యామిలీలు వెలిగించే నవనీతచోరుడివి.

రంగు చీరెల వేటలో జగదేకవీరుడివి.

మా అందరికీ కూడా మిత్రవరుడివి— గురుడివి–

హహ్హో–అయిందా–అయిందా–అప్పుడు మనమేం చేశామో తెలుసా? – ఆహాఁ— ఇల్లా ఉందా దీనిపనీ – అనుకుని, చుట్టూ ఎవ్వరూ లేకపోవడం చూసి, పరాగ్గా వెళ్ళినట్టు దగ్గరకెళ్ళి–మోచేత్తో–అక్కడ–అలా అన్నానొరే–

వహ్వా – వహ్వా – ఆ తరువాతేం జరిగింది?–

—ఆవిడ తనచేతో–ఇలా–అందా?

ఒరే–ఒరే వన్స్‌మోర్–వన్స్‌మోర్–హహ్హోహ్హో–వండ్రఫుల్ గురూ—

ఖంగ్–ఖంగ్–ఖంగ్ – అమ్మమ్మ–ఉః ఉ ఉ–

తల తిరిగిపోతోంది చంద్రావతికి.

ప్లీడరుగారి నోటీసులో ప్లెయింటిఫ్–పిశాచాల మాటల్లో కబుర్లలో–హాస్పిటల్ నర్స్–తండ్రి కంచుగొంతు దగ్గు–

భగవంతుడా నాకేది దారి?

ఏదిదారి?

ఏది కెమిస్ట్రీ పాఠం?

పాఠాలెక్కడుంటాయి?

పుస్తకాల్లో ఉంటాయి

చదివితే — తలలో ఉంటాయి.

పుస్తకంనుంచి తలలోకి వెళ్ళాలి పాఠం

వెళ్ళదు – ఈ పాఠం ఇప్పుడు తలలోకి వెళ్ళదు.

వెళ్ళకపోతే ఎలా? వెళ్ళి తీరాలి.

వెళ్ళి తీరాలి—

తను పరీక్షకి రేపు–

రేపు పరీక్ష—

కెమిస్ట్రీ!!

రైలొచ్చేస్తున్న పట్టాలకింద ఉన్నదానిలా దడదడమని గడగడలాడిపోయింది చంద్రావతి గుండె.

ముగిశాయి పరీక్షలు– లెక్కలూ, ఫిజిక్సూ—

మిగిలింది– కెమిస్ట్రీ!– కెమిస్ట్రీ!!

కెమిస్ట్రీ–తన ప్రాణానికి యమగండం. తన పరీక్షని ముంచేసే సుడిగుండం–

కెమిస్ట్రీ!!—

చంద్రావతి తల పగిలిపోతోంది–

ఈ కెమిస్ట్రీనే నన్ను మూడుసార్లు నిలువునా ముంచింది–మూడు పరీక్షలు–ఏటి నీళ్ళలో ఇసికగూళ్ళలా కలిసిపోయాయి–కరిగిపోయాయి.

చంద్రావతి–"చంద్రావతి ఇంటర్మీడియేట్" అవాలనుకుంది – అయిపోయేదే–కాని కొంచెంలో తప్పింది. కెమిస్ట్రీ శిఖండిలా అడ్డుతగిలింది.

అయ్యో– మూడు సంవత్సరాలు – మూడు సంవత్సరాల చదువు– మూడు సంవత్సరాల శ్రమ–అంతా నష్టేట్లో కలిసిపోయింది.

ఇది నాలుగోసారి—

మొన్న లెఖ్ఖలు–నిన్న ఫిజిక్స్–

ఏమయాయి ఆ పరీక్షలు??

చంద్రావతి మెదడు శూన్యమైపోతోంది–

నిన్న–మొన్న–

తలుచుకుంటే వొళ్ళు కంపరమెత్తిపోతోంది.

లెఖ్ఖల పేపరు– మొదటి లెఖ్ఖ మొదటిస్టెప్పే తప్పుచేసింది– కొట్టేసింది. గాభరాలో తరువాత రెండు లెక్కలూ పాడుచేసింది–మూడో లెఖ్ఖ సగం చేస్తూండగా రెండున్నర గంటలైనట్టు బెల్ మోగింది–ఇంక అరగంట–తొందరలో ఆ లెఖ్ఖ పాడు చేసింది. నాలుగోది సగం చేసేసరికి బెల్లయిపోయింది – వాచరు పేపరు లాక్కున్నాడు – యేడుపొచ్చిందప్పుడు చంద్రావతికి–

ఇప్పుడూ ఏడుపే వస్తోంది.

నిన్న ఫిజిక్సు పేపరూ తగలేసింది. బిట్ క్వొశ్చెన్స్ – సగానికి సగం తప్పు జవాబులు రాసింది. బొమ్మగీసి, అందులోని భాగాలు గుర్తించిందిగానీ, తరువాత వెలుపలికొచ్చి చూసే – గీయవలిసింది ఆ బొమ్మ కాదని తేలింది – కుమిలిపోయింది అప్పుడు చంద్రావతి.

ఇప్పుడూ కుమిలిపోతూనేఉంది. ఏడుస్తూనే ఉంది.

చంద్రావతీ – చంద్రావతీ – ఎందుకు కుమిలి కుమిలి ఏడుస్తావు?

పరీక్షలు తగలేశాను—

చంద్రావతీ – చంద్రావతీ – పరీక్షలెందుకు తగలేశావు?

సరీగ్గా చదవలేదు—

చంద్రావతి – చంద్రావతీ – సరీగ్గా ఎందుకు చదవలేదు?

నన్ను చదవనివ్వలేదు–

చంద్రావతి– చంద్రావతీ– ఎవరు నిన్ను చదవనివ్వలేదు?– అదుగో– అదుగో– అవతల ఆ రాక్షసులు– ఆ పిశాచాలు–ఇవతల– ఇదిగో మా తండ్రి– ననుగన్న నా తండ్రి–

అలాగా– వాళ్ళు నిన్ను ఎందుకు చదవనివ్వలేదు?– అటువేపు సైపుమిషన్ గోల–ప్లీడరు ముండావాడి గోల ఆ డాబా మీదినుంచి ఆ ముండకొడుకుల గోల– దొంగచచ్చిన వెధవలు–బ్రూట్–స్కౌండ్రల్స్ బూతులు మాట్లాడుతారు– నవ్వుతారు–సినిమా పాటలు పెడతారు– నవ్వుతారు–కేకలేస్తారు–ఇడియట్స్–నే చదవలేను–ఈ గోలలో నేనసలు పుస్తకమే ముట్టలేను–

అయితే, పాపం– మీనాన్నేంచేశాడు?–

గది తలుపులు తెరిచుంచితే నాన్న దగ్గులు వినిపిస్తాయి. దగ్గులువింటే నాకు నాన్ననైనా పొడిచెయ్యాలనిపిస్తుంది, లేదా నన్ను నేనైనా పొడుచుకోవా లనిపిస్తుంది– అంతేగాని, పుస్తకంతీసి చదువుకోవాలనిపించదు.

తలుపులు మూసేస్తే పోలా?–

పోతుంది.

నాన్న ప్రాణం పోతుంది.

సంవత్సరం దినాలు అన్నం లేకున్నా బ్రతుకుతాడేమోగాని, క్షణంసేపు గాలి

తోలకపోతే ఒప్పుకోడు నాన్న — తలుపు మూసేస్తే నాన్నకి గాలి రాదట.

తెరిస్తే నాకు చదువు రాదన్నాను

"ఎందుకు రాదూ? మనసుంచి చదువు"- అంటాడు.

పరీక్షపోవడానికి నా పరధ్యానం కారణమంటాడు.

అన్నీ ఉన్నాయి నాన్నకు — ఒక్క- హృదయం తప్ప. ఆఫీస్‌లో ఏ పాతఫైల్లో పెట్టి కట్టేశాడో హృదయాన్ని-ఆ సంగతే మరిచిపోయాడు.

చిన్న పిన్ను నేలమీద పడితే, నాలుగు గజాల అవతల అడుగుల చప్పుడు వినిపిస్తే- మరింక నేను పుస్తకంమీద ధ్యాస నిలపలేను- అలాంటి నేను- ఈ కొండ గోలమథ్స్- ఈ బండ పుస్తకాలని. ఈ కెమిస్ట్రీని- ఎలా చదవగలను?

త్రిబెవన్- టు ది ఎస్టేట్ మేనేజర్- టప్టప్-టప్టప్-టప్టప్టప్ టప్టప్టప్- నువ్వేన్నయినా చెప్పరా బ్రదర్-ఈ ఆడవాళ్ళని మాత్రం నమ్మటానికి వీల్లేదు- మహా డేంజరస్సనుకో- మొన్న నేమెందనుకున్నావ్?-నా మెడికో ఫ్రెండ్ లేడూ - రామారావ్ - వాడి రూములో ఉన్నాన్నేను — వాడు బాత్‌రూం కెళ్ళాడు — ఆ పక్క- వాటాలోంచి ఒక పిల్లొచ్చింది - పిల్లంటే ఎలా ఉందనుకున్నావు? హాట్ హాడ్ కేక్‌లా ఉంది- వాట్ సిక్స్‌టీ నైన్ (VAT 69) బోటిల్‌లా ఉంది (బోటిల్- సీలు తీసిందా తీయందా గురూ?) - ఛస్- నువ్వు షటప్-తియ్యనిదే-అలాగే ఉంది- తియ్యనిదేతియ్యగా ఉందును- ('వహ్వా- వహ్వా')వెనకవాటుగా చూసి. నన్నేరామారావనుకుని-వచ్చి కౌగలించుకుంది-("హా- హా- ఏమదృష్టం గురూ!-") ఎందుకు చెప్పానంటే- ఒకసారి అందులో పడ్డాక ఆడదానికి ప్రపంచమంతటా తన ప్రియుడే కనిపిస్తాడు- ("అలాగేం- అలాగేం-") మరేం ఆడదంటే ఏమనుకున్నావురా గురూ-

చంద్రావతికి తల పగిలిపోతోంది-

ఆడదంటే ఏమనుకున్నావు?-

మగాడా! మగాడా!!

ఆడదంటే ఏమిటనుకున్నావు??

మెరుపు కొట్టినట్టయింది చంద్రావతికి!

సుదర్శనం!!

ఆ పేరు జ్ఞాపకం వచ్చేసరికి చంద్రావతి రక్తం వేడెక్కి- పోయింది— ఆవిరి కాబోయేదానిలా సలసలమని కాగిపోయింది రక్తం!

సుదర్శనం—

ఆడదంటే ఏమిటనుకున్నావు?

(ఎవడీ సుదర్శనం?

ఈ చంద్రావతితో ఆ సుదర్శనుడికి ఏమిటి సంబంధం!?—)

సుదర్శనం — చంచలకు అన్న అంటే పెదనాన్న కొడుకు. చంచల చంద్రావతి ఫ్రెండు. అంతే క్లాసుమేటు కూడా. అంతేకాక చంద్రావతీ వాళ్ళ వీధిలోనే— వీధిచివర బంగళాలో ఉంటోంది కూడా.

చంచల నాన్న లక్షాధికారికాదు కోటీశ్వరుడు. సుదర్శనం చదువుకునేవాడు కాదు. కానీ కాలేజీకి వెళ్ళేవాడు. సుదర్శనం ఉట్టి మంచివాడిలా కనిపించేవాడు కాడు. అతి మంచి వాడిలా కనిపించేవాడు. అతి


# జనాదరణగల పాప్యులారిటీ పోటీ

ఎంట్రీ ఫీజు లేదు - మీరు బహుమతి గెలుపొందగలరు.

| | | | |
|---|---|---|---|
| | | | |
| | | | |
| | | | |
| | | | |

మొదటి బహుమతి: ఒక స్కూటరు వెస్పా లేక ఆల్విన్ రిఫ్రిజిరేటర్. 2 వ బహుమతి: ఒక టేపు రికార్డరు లేక ఆటోమాటిక్ కెమెరా లేక రేడియోగ్రాం. 3 వ బహుమతి: (100) టోయో జపాన్ మోడల్ 3 బ్యాండ్ ఆల్‌వరల్డ్ ట్రాన్సిస్టర్లు ధర: రు. 275/-, 4 వ బహుమతి: (10) టోయో జూనియర్ జపాన్ మోడల్ 3 బ్యాండ్ ఆల్‌వరల్డ్ ట్రాన్సిస్టర్ ధర: రు. 250/-.

## మీరు చేయవలసినది?

15 (పదిహేను) నుంచి 30 (ముప్పది) వరకు గల అంకెలను నిలువుగా. అడ్డముగా. అయిమూలగా ఎటుకూడినా మొత్తము 90 (తొంభై) వచ్చునట్లు ఒక అంకెను ఒకేసారి ఉపయోగించి పై ఖాళీ గడులను పూరించవలయును.

ఎంట్రెన్స్ ఫీజు : ఎంట్రీ ఫీజు లేదు. ఇది ఒక పాప్యులారిటీ పోటీ మాత్రమే.

ఆఖరి పోస్టింగ్ తేది : 8-5-73. ఫలితం తేదీ : 10-5-73

సహాయముకొరకు 14 నుంచి 29 వరకుగల అంకెలతో 86 మొత్తముగలనమూనా.

| | | | |
|---|---|---|---|
| 15 | 21 | 24 | 23 |
| 25 | 22 | 19 | 20 |
| 27 | 28 | 17 | 14 |
| 16 | 15 | 26 | 29 |

పోటికి నిబంధనలు : (1) సాదా కాగితము ఉపయోగించాలి. (2) సవరణలు. దిద్దులు. కటింగులుకల ఎంట్రీలు అంగీకరించబడవు. (3) ప్రమోటర్ల తీర్మానము ఖాయమైనది మరియు చట్టబద్ధముగా న్యాయమైనది. ఈ పోటీ విషయములో ఇది ఒక ముఖ్యమైన షరతు. (4) ఎంట్రీలయొక్క పత్రము మా అఫిషియల్ సీలు సొల్యూషన్‌తో పరిపోల్చి ఖచ్చితముగా చూడబడును. నగదుగా బహుమతి ఇవ్వబడదు. (5) మొదటి బహుమతి : (1) అఫిషియల్ సొల్యూషన్‌తో సక్రమముగా వున్నట్లు కనుగొనబడిన దానికి ఇవ్వబడును. (6) రెండవ బహుమతి : (1) పైన అడ్డముగావున్న మూడు వరుసలలో సమానముగా వున్నదానికి ఇవ్వబడును. (7) మూడవ బహుమతి: (100) మా అఫిషియల్ సొల్యూషన్‌తో వరుసతోనైనా. సంఖ్యతోనైనా. సమానముగా వున్నదానికి ఇవ్వబడును. (8) నాల్గవ బహుమతి: డాలర్ ప్రమోటరుకు సంతృప్తిపిచ్చిన పది (10) ఎంట్రెంట్స్‌కు ఇవ్వబడును. (9) గెలుపొందిన వారికి సదరు బహుమతులు పొందుటకు పోస్టేజి, ప్యాకింగ్. సెన్సు ఫీజు చెల్లించవలయును. (10) 3వ మరియు 4వ బహుమతి గెలుపొందినవారుకూడా పైన తెల్పిన ఖర్చులతో కూడా ట్రాన్సిస్టరు ఖరీదులో సగం చెల్లించాలి. మరియు మా నిబంధనలకు షరతులకు లోబడి వుండాలి. (11) ఫలితములు ప్రకటించిన వెంటనే సెన్సు ఫీజు వగైరా చెల్లించేందుకు గెలుపొందినవారికి ఉత్తరం పంపబడును. (12) ఫలితములు పొందుటకు 45 పైసలు పోస్టలు స్టాంపులు పంపాలి. (13) ఒక కుటుంబము ఒక ఎంట్రీ మాత్రమే పంపాలి. (14) అడ్రసు ఇంగ్లీషు లేదా హిందీలో వ్రాయాలి. (15) కటింగ్ లేక నిబంధనల కాపీ భవిష్యత్తులో ఉపయోగార్థము ఉంచుకోండి.

Director Contest Department :

**PARKER AGENCIES (W-90)**

P. O. Box No. 1[illegible] DELHI-6.

# చదువు

మంచితనం ధూర్తలక్షణం అని ఇంకా అప్పట్లో చంద్రావతికి తెలీదు. అందుచేతనే చంచలా వాళ్ళింటికి సంకోచం లేకుండా వెళ్తూ వస్తూ ఉండేది. చంచల మంచిది. అంతేకాదు– ''నువ్వెంతో మంచిదానివి చంద్రా, నువ్వంటే నా కెంతో ఇషం-నేనే మగాణ్ణయి వుంటే నిన్ను చప్పున పెళ్ళాడేసి ఉందును" అని అప్పుడప్పుడూ చంద్రావతితో అనేది. చంద్రావతి సిగ్గుపడిపోయేది. అప్పుడు యింటరు (పరీక్షలకని కూడా) మొదటిసారే చదువుతూ ఉండేది చంద్రావతి. కాలేజీకి వెళ్తూండేది. చంచల బలవంతం మీద చంచలతో కలిసి చంచలావాళ్ళ కార్లో వెళ్తూండేది. చంచల బలవంతంమీద చంచలతో కలిసి చంచల డబ్బుమీద సినిమాలు చూస్తుండేది. పరీక్షలు దగ్గరపడ్డప్పుడు. చంద్రావతికి గుండె గుబులెక్కువైనప్పుడు; "నేనీసారి తప్పిపోతానేమో," అని చంద్రావతి భయపడ్డప్పుడు; అప్పుడు– చంద్రావతికి చంచలే ధైర్యం చెప్పింది. తన టెక్స్ట్ బుక్స్ ఇచ్చింది. తను ప్రైవేటు మాస్టార్ల దగ్గర్నుంచి సంపాదించుకున్న నోట్సులు కూడా ఇచ్చింది. అప్పట్నుంచీ కూడా ఇంట్లో చదువుకోవాలంటే చాలా విసుగ్గా ఉండేది చంద్రావతికి, అప్పుడూ ఇదే ప్లీడరుగాడు. ఇదే టైపిస్టుకు-ఇదే బొంగురు గొంతుతో నోటీసులు డిక్టేట్ చేసేవాడు. అప్పుడూ ఇదే ప్లీడరుగారబ్బాయి–ఇదే డాబామీద– ఇంత జులాయి వెధవలతోనూ– ఇంత పైశాచికోత్సాహంతోనూ– గోల చేసేవాడు అప్పుడూ ఇదే-భూతం నోటిలా తెరిచిన గుమ్మాని కవతల ఇదే శవాకృతితో కూచుని నాన్న. ఇదే కంచుదగ్గులు దగ్గేవాడు.

అప్పుడూ చంద్రావతికి ఇదే విసుగు ఇదే చిరాకు ఇదే అసహాయత, ఇదే కోపం ఇదే దుఃఖం.

అప్పుడూ ఇలాగే ఏడ్చేది చంద్రావతి. అప్పుడూ ఇలాగే నెత్తి బాదుకుంటూ ఏడ్చేది—

ఒకనాడు చంచల మరీమరీ బలవంతపెటగా తన ఇబ్బందులన్నీ చెప్పుకుంది చంద్రావతి- చెప్పుకుని చెప్పుకుని ఏడ్చింది.

చంద్రావతి ఏడుపుచూసి చంచల చాలా బాధపడింది. "ఇన్నాళ్లూ నాతో ఎందుకు చెప్పలేదు చంద్రా?—నీ కష్టం నేను ఆ మాత్రం తీర్చలేననుకున్నావా?", అంటూ మందలింపుగా కసిరింది. "రేపట్నుంచి కాలేజీ వదిలాక నేరుగా మీ ఇంటికి వెళ్ళకు, ఇద్దరం సాయంత్రాలు మా ఇంట్లోనే ఒకటిగా చదువుకుందాం– ఎటూ మన ఇళ్ళు రెండూ ఒకే వీధిలోనేగా—వచ్చెయ్యి— కంబైన్డ్ స్టడీస్ చేసుకుందాం'' అని ఇన్వైట్ చేసింది.

ఆహ్వానాన్ని అమందానందంతో అంగీకరించింది చంద్రావతి. చంచలా వాళ్లిల్లు దగ్గరే కదాని, చంద్రావతి అమ్మా నాన్నా కూడా ఆటే అభ్యంతరం చెప్పలేదు.

చాలా సంతోషంగా ఉందప్పుడు చంద్రావతికి. చంచలతో కలిసి ఇరవై రోజులు చాలా బాగా చదువుకుంది. చంచలతో కలిసి సరాసరి వాళ్ళింటికే వెళ్ళడం, చంచల బలవంతాన, వాళ్ళింట్లోనే టిఫిన్ తినడం, సాయంత్రమంతా దాదాపు రాత్రి ఎనిమిదయే వరకూ చంచలతోనే చదువుకుని, అప్పుడు ఇంటికి వచ్చెయ్యడం – అంతా చాలా సౌకర్యంగా ఉండేది చంద్రావతికి, చంచలతో స్నేహం పాలు పొంగించిన కొత్తిలులా ఉండేది చంద్రావతికి. కాని, కుండ పాలలో చుక్క విషంలా వచ్చాడు సుదర్శనం.

అన్ని దినాలూ అతను ఆ ఇంట్లోనే ఉంటూ "చదువుకొంటూ"నే ఉన్నా అసలు అతనంటూ ఒక్కడున్నాడా లేదా అనిపించేవాడు ఎప్పుడైనా చంద్రావతి ఎదురైతే తనలో తాను నవ్వుకుంటూ న్నట్టు పలకరింపుగా నవ్వుతూ వెళ్ళిపోయే వాడేతప్ప, మరి కన్నెత్తి పూర్తిగా అయినా చూసినట్టు కనిపించేవాడు కాదు. అలాంటి సుదర్శనం; ఆ రోజు-ఆ రోజు-

తలచుకునేసరికి చంద్రావతి పిడికిళ్ళు అప్రయత్నంగా బిగుసుకున్నాయి. ఆమెకు తెలీకుండానే ఆమె పళ్లు పటపటలాడేయి.

ఆ రోజు ఆదివారం – మామూలు ఆదివారాల్లాగే – సాయంత్రం చంచలా వాళ్ళింటి కెళ్ళింది చంద్రావతి. మామూలుగా వెళ్ళి చంచల గదిలో కూచుంది. గదిలో చంచలలేదు. కాస్సేపట్లో వస్తుందనుకుని గదిలో కూచుని, పుస్తకాలు తిరగెయ్య బోయింది చంద్రావతి. అంతలో ఉలిక్కిపడింది.

అంత సేపూ గదిలో ఒక మూల. కిటికీ వారగా కుర్చీలో కూచుని ఉండి, అప్పుడే ప్రాణం వచ్చిన బొమ్మలా కదిలాడు సుదర్శనం!–

సుదర్శనం!!!

తలుచుకుంటే చంద్రావతి హృదయంలో ఆవిరి పొగలు ఉబుకుతున్నాయి-

సుదర్శనం!– అంతవరకూ అతి మంచివాడుగా కనిపించిన సుదర్శనం అంతలో అతంబ్రూట్‌లా ఎందుకు ప్రవర్తించాడు?

"చంచల లేదు– బంధువులొచ్చారు ప్రొద్దున–వాళ్ళతో సినిమాకెళ్ళింది–" అని మామూలుగానే మాట్లాడినవాడు, తను తిరిగి వచ్చేదామని లేవబోతుంటే — "కూచోండి పోదురుగాని" అని ఎందుకు అన్నాడు? తను కుర్చీలోంచి లేచి, "నేను వెళ్ళి చదువుకోవాలి—'' అని వచ్చెయ్యబోతుంటే—

ఏమిటి తన చుట్టూ పాములాపడ్డది?

దేవుడా-ఎందుకిచ్చావీజన్మ— ఈ ఆడజన్మ—

ఫూల్ సుదర్శనం — బ్రూట్ సుదర్శనం—విలన్ సుదర్శనం—

ఏం పేలేడు?! ఎలా పేలేడు?!?

వీధిలో కుక్కగానైనా పుట్టొచ్చునేమో గాని, దేవుడా పేదింటి ఆడపిల్లగా మాత్రం పుటకూడదు— పుట్టినా వయసొచ్చే ముందుగానే చావకుండా ఉండకూడదు.

చీకట్లో, ఒంటరి గదిలో, పేదింటి ఆడపిల్లమీద చెయ్యేసిన సుదర్శనం—

''ఆడదంటే ఏమనుకున్నావు?'', అంటే సుదర్శనం బెదిరాడా? సిగ్గుపడ్డాడా??–

సుదర్శనంగాళ్ళు బెదరరు–సిగ్గుపడరు–

సోమవారం కాలేజీకి వేరుగా వెళ్లింది చంద్రావతి.

చంచలా వాళ్లింటికి వెళ్ళలేదు. కాలేజీలో కలిసింది చంచల. "అనుకున్నాన్లే నువ్వు మా ఇంటికి రావని — అయినా నువ్వింత పాత చింతకాయ పచ్చడివనుకోలేదు నేను — నిన్న సాయంత్రం మా అన్నయ్య కాస్త సరదాగా మాట్లాడితే స్టుపిడ్‌లా బిహేవ్ చేశావటగా—"

ఆశ్చర్యపోయింది అప్పుడు చంద్రావతి.

అప్పుడే తెలుసుకుంది – సుదర్శనంగాళ్ళు సిగ్గుపడరు– బెదరరు.

ఆ ఏడాది మరింక సరిగ్గా చదవలేకపోయింది చంద్రావతి. మనసు చెడింది. అప్పట్నుంచి ఆమెకు లోకంలో అందరూ సుదర్శనం గాళ్ళలాగే కనిపించారు. ముసిలి ప్లీడరుగాడు–అవకాశం దొరికితే పెత్తనం చేసే ముసిలి సుదర్శనం. ప్లీడరు గుమాస్తా–బానిసలా బ్రతుకుతూన్నా, తన కసినంతా టైపు మిషన్‌మీద తీర్చుకునే వెధవ సుదర్శనం. డాబామీద ప్లీడరు కొడుకు – వాడి పేకాట మిత్ర పిశాచాలూ – వాడి పిశాచపు ట్రాన్సిస్టర్– వాళ్ళలో ఒక్కొక్కడూ ఒక్కో రోగ్ సుదర్శనం.

చంద్రావతి చదువు పోయినా తనకు గాలో స్తేచాలు ననుకునేచంద్రావతి నాన్న– ఒక స్వార్థపరుడైన హృదయంలేని సుదర్శనం.

చంద్రావతి మనస్సులో కరకరగా కొరుకుకునే విషపు విచ్చుకత్తి సుదర్శనం!

ఆ యేడాది ఇంటరు తప్పింది చంద్రా

వతి. మళ్ళీ పైపైపేటుగా కటింది- మళ్ళీ-మళ్ళీ-మళ్ళీ అన్నిసార్లూ తప్పింది.

దానికంతటికీ కారణం వాడే- వాడు-ఒక్కడు కాదు-అందరూ- అందరూ సుదర్శనం గాళ్ళే!-

పిటగోడమీద ట్రాన్సిస్టర్ దయ్యం మూలిగినట్టు మూలుగుతోంది. ప్రసారాలు ఎప్పుడో కట్టేశారు. పిశాచాలు మాత్రం ఇంకా పేలుతున్నారు- ఇంకా నవ్వుతున్నారు—

మిషన్‌లోకి మళ్ళీ కాగితం ఎక్కించాడు టైపిస్టు—ప్లీడరు వేరే పిటిషన్ ఏదో డిక్టేట్ చేస్తున్నాడు—

ఖంగ్ ఖంగ్‌మని ఇంకా దగుతూనే ఫైల్స్ చూసుకుంటున్నాడు చంద్రావతి తండ్రి—

ఆవేశపు వేడివల్ల కాబోలు—చంద్రావతికి గొంతు ఆర్చుకుపోయింది.

దిగులుగా పుస్తకాలికేసి చూసుకుంది చంద్రావతి.

గుర్తుకోసం పేజీ కొసలు మడచినపెక్స్ట్ పుస్తకాలు-మూడు సంవత్సరాల చదువు చేత నలిగి నలిగి చింకిపాతల్లా తయారైన నోట్ పుస్తకాలు. మూడు సంవత్సరాల పరీక్షల క్వొశ్చెన్ పేపర్లు. వాటిమీద మార్జిన్‌లో "ఐ ఎమ్ పీ" అని రాసిన గుర్తులూ-

అలా వాటికేసి చూస్తున్నకొద్దీ చంద్రావతి గుండె దిగులు దిగులుగా గుబులు గుబులుగా బరువెక్కిపోయింది.

మెదడులో ఏదో ఒక గదిలో ఏదో పొగలేచినట్లయింది.

నాలుకెండిపోతోంది చంద్రావతికి-గొంతు ఆర్చుకుపోతోంది-

చేతుల్లోకి తీసుకోబోయిన పుస్తకాన్ని నిస్సత్తువగా జారవిడిచేసింది చంద్రావతి.

పైకి లేవాలని కదిలితే, కుడికాలు తిమ్మిరెక్కి బరువుగా తోచింది. గోడను ఊతగా పట్టుకుని లేచింది చంద్రావతి. ఒక్కడుగు ముందుకు వేసింది. తమాషాగా ఉంది - కించిత్తు బాధగా ఉంది-వింతగా ఉంది-

ఎవరైనా వచ్చి కత్తితో ఈ కాలు నరికేసి వెళితే బాగుణ్ను-అనుకుంది చంద్రావతి. (రేపు పరీక్షకి వెళ్ళడం కూడా తప్పుతుంది-)

కొంచెం కొంచెంగా కుంటుకుంటూ గుమ్మంలోకి వచ్చింది చంద్రావతి.

కూతురు వచ్చిన అలికిడివిని, ఫైళ్ళలోకి వంచినతల పక్కకితిప్పి. జారిన కళ్ళజోడు సరిగ్గా సర్దుకుంటూ. బొంగురు గొంతుకతో-"ఏమ్మా-ఇలా వచ్చావూ?" అనలేదు. చంద్రావతి తండ్రి కూతురు రావడమేకాదు గుమ్మంలో బాంబు పేలడమే జరిగినా చెవరనివాడిలా. తనపనిలో తాను లీనమై పోయున్నాడు

చప్పుడు చెయ్యకుండా నడవలోకి వచ్చింది చంద్రావతి.

అక్కడో మూలని చింకి చాపలు పరుచుకుని మాసిన గుడ్డబొమ్మల్లా పడుకుని ఉన్నారు-తల్లీ. తమ్ముడూ.

నిద్రలో తల్లి నోరు కొంచెంగా తెరిచి ఉంది. చప్పున చూస్తే వికారం కలిగించేలా ఉంది.

మిగతా పనులేవీ లేకుండా తీరిగ్గా ఉన్నప్పుడు ఆమె చంద్రావతిని యథాశక్తి అదే నోటితో తిడుతూ ఉంటుంది. చంద్రావతిని వేగిరం ఎవడో ఒక "గంతకు తగ బొంత"ను వెదికి— వాడికి "ముడెట్టేస్తే సరిపోతుం"దని భర్తనెప్పుడూ సాధిస్తూ ఉంటుంది. గుండెలమీదకుంపట్లా ఎదిగిన పిల్లని ఎంతకాలం పెట్టుకుంటాం చెప్పండి-మనం బ్రతికుండగానే ఏదో ఆ మూడు ముళ్ళు వేయించేస్తే మన బరువు తీరిపోతుంది-." అనేది. "మన కన్నబిడ్డ మనకు బరువేమిటి-." అనిభర్త అంటే. "ఆడపిల్లనగా ఎప్పుడో ఒకప్పుడు అత్తిల్లంటూ చూడక తప్పదుకదండీ-అది ఎంత తొందరగా అవుతే అంత మంచిది. నేను మాత్రం ఈ బరువుని ఇంక ఎన్నో దినాలు మొయ్యలేను—"

అప్రయత్నంగా నవ్వుకుంది చంద్రావతి— పెళ్ళి! తనకు— పెళ్ళి!!

నిశ్శబ్దంగా మంచినీటి కడవ దగ్గరికి నడిచింది. గ్లాసెడు నీళ్ళు ముంచుకుని గటగటా తాగేసింది. అమృతంలాఉంది. మరో గ్లాసు —మరోగ్లాసు—

"చంద్రా—నాక్కూడా ఓగ్లాసు మంచి నీళ్ళు తెచ్చిపెట్టమ్మా—" అప్పుడుమాట్లాడాడు చంద్రావతి తండ్రి: అదయినా ఇంకా ఫైళ్ళలోంచి తలెత్తకుండానే.

తండ్రికి నీళ్ళందించి. ఆయన దగ్గర్నుంచి గ్లాసు మళ్ళీ తీసుకునేసికూడా. అక్కణ్నుంచి కదలలేదు చంద్రావతి—

"ఏమిటమ్మా-" అన్నాడు తండ్రి-

"నాన్నా - నేనీ తలుపు మూసుకుంటాను నాన్నా-" అంది చంద్రావతి ఆఖరి ప్రయత్నంగా అంటున్నట్లు.

"అసలే విసుగ్గా ఉన్న తండ్రి ముఖం ఆ మాటలతో అంతలో వికృతంగా ముడుచుకుపోయింది-

"నే నిక్కడ కూచోడం కూడా నీకు పడదా చంద్రా - నా సంగతి నీ కెందుకు చెప్పు? - నీ మానాన్న నువ్వు పరీక్షకి చదువుకోరాదా? యింకెంతలే - యింకో గంట - ఆ తరువాత నేను పడుక్కునేస్తాలే-"; కళ్ళు మూసుకుని తల గీక్కుటూ ఆ మాటలు అని, కళ్ళు తెరిచిన చంద్రావతి తండ్రికి. పక్కనే చంద్రావతి కనిపించలేదు.

గదిలోకి వెళ్ళిన ఆమె పుస్తకాలముందు బొమ్మలా కూలబడడం కనిపించింది. తనలోతాను ఏదో గొణుక్కుంటూ. తల అడ్డంగా తిప్పుతూ - కళ్ళజోడు తగిలించుకుని సవరించుకుని మళ్ళీ ఫైళ్ళలో తల దూర్చాడు చంద్రావతి తండ్రి.


చక్కని ఇంగ్లీషు రాయడమెలా?

రచన: ఎం. వి. రామరెడ్డి, M.A.,B.T.

ఈపుస్తకంలో ఇంగ్లీషుభాషను చక్కగా రాయడానికి కావలసిన విషయాలన్నీ తెలుగులో వివరించబడ్డాయి. ఇందులో ఆంగ్లభాషావాక్య నిర్మాణాన్ని వివరించడంతో బాటు ఆ భాషలో అధికారాన్ని సంపాదించేందుకు అనువైన మార్గాలు సూచించబడ్డాయి. తెలుగులో ఇంతవరకు వెలువడని అపూర్వ గ్రంథం. ఈపుస్తకం ప్రతి యింటికీ ప్రతి విద్యార్థికీ కల్పవృక్షంలాంటిది.

వెల: రు. 5-00 లు. పోస్టుఖర్చులు అదనం.



ఇంగ్లీషు సంభాషణ కళ

రచన: ఎం. వి. రామరెడ్డి, M.A.,B.T.

ఈపుస్తకంలో Spoken English కు సంబంధించిన విషయాలు తెలుగులో వివరించబడ్డాయి. ఇందులో ఇంగ్లీషు సంభాషణలు (conversations) వినూత్నపద్ధతిలో వివరించబడ్డాయి. ఈసంభాషణలకి తెలుగు అనువాదాలుగూడ ఇవ్వబడ్డాయి. ఈపుస్తకం సహాయంతో రెండునెలల్లో ఆంగ్లంలో మాట్లాడవచ్చు. ఇంగ్లీషు మాట్లాడాలని కుతూహలపడేవారికి చాల ఉపయోగకరమైన పుస్తకం.

వెల: రు. 3-00 లు. పోస్టుఖర్చులు అదనం.

రెండింటిని ఒకేమారు కొనేవారికి పోస్టుఖర్చులు ఉచితం.

జనహిత పబ్లికేషన్స్, రాయనగర్. గన్నవరం (కృష్ణాజిల్లా) ఎ. పి.

# చదువు

పుస్తకాల ముందు కూచున్న చంద్రావతి పొంగి వచ్చే దుఃఖాన్ని అదుపులో పెట్టుకునేందుకు వ్యర్థప్రయత్నం చేసింది. శ్వాస ఎగబీల్చి వదిలింది. ఏదో పుస్తకం చేతులోకి తీసుకుంది. అతి ప్రయత్నం మీద పేజీలు తిరగేసింది.

పేజీలు తిరిగాయి. కాని.

తలలోకి ఏమీ ఎక్కలేదు.

పట్టుబట్టి మళ్ళీ మొదటి పేజీకొచ్చింది.

టప్-టప్-టప్-టప్టపప్ప .... క్లింగ్ (రోలరు ఆ చివరి కెళ్లింది) జర్ర్ర్ర్ర్రు-- (రోలరు మళ్ళీ ఈ చివరికొచ్చింది మళ్ళి )టపప్- టప్టటపప్టప్. టప్టప్-టప్టప్టప్టప్టప్-

యా!-(చప్పట్ల చప్పుడు-) అయితే మన లెక్చరర్ సుధాకరం పెద్ద గ్రంథసాంగుడేనండూ-

ఒట్టి గ్రంథసాంగుడు కాదు- శతాధిక గ్రంథసాంగుడు-

హాహ్హా-హహ్హా-

ఖంగ్-ఖంగ్- ఉబ్ ఉబ్. ఆఅబ్బ్బ్బ డ్డ్డ -ఆః ఉఉఊః-

అక్షరాలూ పదాలూ వాక్యాలు పేజీలూ కామాలూ ఫుల్‌స్టాపులూ ఈక్వేషన్లూ ట్యాబులర్ కాలమ్‌లూ లేబొరేటరీ ఎక్స్‌పెరిమెంట్లూ అబ్సర్వేషన్లూ —— అన్నీ కలగాపులగమై గజిబిజై గానటబీసబై చెదిరి విడివడి కలబడి తారుమారై తల్లక్రిందులై పోతున్నాయి.

చంద్రావతికి తల తిరిగిపోతోంది.

ఇప్పుడు నేనీ వెధవ పుస్తకాలెందుకు చదవాలి?

వెధవ పరీక్షలు రాయాలి—అందుకు!-

పరీక్షలెందుకు రాయాలి?

ప్యాసవాలి—అందుకు!—

ప్యాసెందుకు కావాలి? వెర్రి ప్రశ్న-

ఈసారి ప్యాసుకాకపోతే - తల్లి కేకలేస్తుంది. తండ్రి తిడతాడు.

తల్లి తిడుతుంది. తండ్రి కేకలేస్తాడు.

ఈసారి ప్యాసుకాకపోతే — యింకెప్పుడూ ప్యాసు కాదు-ప్యాసు కాకపోతే-తనకు పెళ్ళికూడా కాదు(ట)-పెళ్ళి కాకపోతే — తల్లికి తను బరువు-బరువు!

చంద్రావతికి ఉక్రోషం ముంచుకొస్తోంది.

వెధవ పుస్తకాలు — వెధవ చదువు — వెధవ పరీక్షలు — వెధవ రిజల్ట్సు — వెధవ ప్యాసు — వెధవపెళ్ళి — వెధవ పెళ్ళి ! ! ! ! !

టప్‌టప్ - టపపప్టప్టప్ — టప్టప్—

ఇన్ దిస్ సిట్యుయేషన్ — ఐ ప్పేది ఆనరబుల్ కోర్ట్- టుబిసో కైండ్ అజ్ టు అదర్న్ ది హియరింగ్ ఫరె ఫ్యూచర్ డేట్ టప్టపపపనప్టప్టపప్ — టప్టప్.

కానాసినిమాలో హీరోయి నుందొరే- అందునా ఆ బేతింగ్ సీన్లోఉందీ- వ్వహ్-అలా ఉందిరా.

హా-హా- ఎలా ఉందెలా ఉందీ? —

ఖ్ఖింగ్-శ్రీరామచంద్రా - ఉఉహ్హుం-అహ్హా—

చంద్రావతికి తిక్కపుట్టుకొస్తోంది.

అటూఇటూ- ఇటూఅటూ చూసింది.

తిప్పబోతూన్న కాగితాన్ని పుస్తకంలోంచి పర్రున చించేసింది-దాన్ని ఉండగా చుట్టి కిటికీలోంచి అవతలికి పారేసింది-

కిటికీలోంచి అవతలికి తొంగిచూసి. క్షణం అలాగే ఆగింది చంద్రావతి

కిటికీ అవతల జాగాలో ఉన్న మొక్కలు గాలికి జాలిగా కదులుతున్నాయి మందారాలు ఎర్రటి రక్త మందారాలు అవి-

వెన్నెల్లో రోషంగా మెరుస్తున్నాయి.

ఆ పువ్వుల్ని అలా చూస్తూండగా ఏవేవో పాత సంగతులు జ్ఞాపకంవచ్చాయి చంద్రావతికి.

చిన్నప్పుడు తను చీమల పుట్టకేసి సరదాగా చూస్తుండగా అవతలి గదిలోంచి గోల వినిపించడమూ, తను అక్కడికి వెళ్ళిచూడగా—తాతమీదపడి ఏడుస్తూన్న అమ్మ......; స్కూలునుంచి వస్తుండగా తన కళ్ళముందే లారీ ఏక్సిడెంటయి అక్కడికక్కడే నెత్తురు మడుగులో కాళ్లూ చేతు లూగించుకుని మరణించిన పల్లెటూరివాడూ; తన స్కూలుపిల్లే —అప్పుడు తన ఈడు పిల్లే —ఎందుకో బావిలోదూకి చచ్చిపోగా తమకి స్కూలు ఒక దినం సెలవు ఇచ్చిన వైనమూ; పదుగు పెళ్ళాం ఎవడితోనో లేచిపోగా ప్రొద్దున్నే గుండె బాదుకున్న ఎదురింటి ముసలి షావుకారూ; దారిప్రక్కన తిరగబడిపోయినకారూ ఫుట్‌పాత్ పక్కన అసహ్యంగా పడుకున్న తాగుబోతువాడి ఈగలు ముసురుతూన్న నోరూ-చంచల ఇంట్లో చీకట్లో-తనని ఒంటరి దాన్ని చేసి-ధైర్యం చేసిన సుదర్శనం-సుదర్శనం-సుదర్శనం-

అలా ఎన్నెన్ని దృశ్యాలో ఆమె కళ్ళముందు కదిలిపోయాయి.

ఆమె గుండెలప్పుడు బండనేలమీద పరిగెత్తే పిచ్చి గుర్రాల్లా పరిగెత్తేయి.

మై క్లయింట్ అరెంజ్డ్ ఫర్-టప్టప్టప్-టప్టపప్పప్పపప్టప్-టప్టప్-బ్రేవో మై గుడ్ బోయ్-అయితే పిటని చివరికి పట్టేవన్నమాట-అయితే ఆ మొగుడుగాడు—ఖంగ్-ఆ-అబ్బ-నారాయణా-ఖ్కంగ్ ఖ్కంగ్-

తల బాదుకుంది చంద్రావతి ఏడ్చింది ఏడ్చింది-

తండ్రీ ! తండ్రీ !
ఈ నరకం నదుమను
ఈ మసిలే నూనే కాగుల్లో నేను నిలవలేను-
బాబూ-ఈ కత్తుల నిచ్చెనను
నే నెక్కలేను-నేనెక్కలేను-
భగవంతుడా - ఈ వేదనల వర్షంలో
నే తడవలేను - నే తడవలేను.
దేవుడా - ఈ విషపు నిప్పుల చెరువును
నే నీదలేను - నే నీదలేను.

బొమ్మలా కూచుండి పోయింది చంద్రావతి.

ఆమె మనస్సులో తలుపులు తెరుచుకున్నాయి - ద్వారం - ద్వారం వెనుక— ద్వారం - ద్వారం వెనుక ద్వారం వెనుక ద్వారం - అలా అనంతమైన దూరం.

అవతల చీకటి.

చిక్కటి చీకటి.

లోపల నిశ్శబ్దం.

నిశ్శబ్దంలో చీకటి తోట- అందులో అక్కడెక్కణ్ణుంచో సన్నటి వెలుగు— మొదట సన్నటి వెలుగు- తరువాత అదే దీపకళిక—మంట— మహాజ్వాల-రక్తం మరుగుతోంది- మరుగుతోంది— మహాజ్వాల సెగకి-

చంద్రావతి తలమీద ముంగురులు నిక్కబొడుచుకున్నాయి.

ఆమె కళ్ళలో హోమగుండాల తేజస్సు వెలిగింది.

* * *

బాగా తెల్లవారిపోయింది.

పరీక్ష టైమైపోతోంది.

కూతురింకా లేవలేదేమిటాని వచ్చింది చంద్రావతి తల్లి. గది తలుపులు బిగిసి ఉన్నాయి.

కిటికీలోంచి చూసిన తల్లి "కెవ్వు"న కేకవేసింది.

చంద్రావతి పుస్తకాలు తెరిచినవి తెరిచి నట్టే పడి వున్నాయి.

"నేను ఈ బరువు మోయలేను -". అని చంద్రావతిని గురించి అంటూండేది తల్లి. ఇంక ఆ బరువును ఆమె మోయ నవసరంలేదు.

చంద్రావతి బరువును ఇప్పుడు ఆ గది దూలం మోస్తోంది!- ★

